ఈరోడ్డుపై వెళ్లేదెలా..!

- అధ్వానంగా ఐదో డివిజన్ రోడ్డు
- నాలుగు గ్రామాలకు ప్రధాన రోడ్డు దుస్థితి
- పట్టించుకోని అధికారులు పాలకులు


గుంతలతో ఉన్న సింధూర కళాశాల వైపు వెళ్లే ప్రధాన రోడ్డు

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ నర్రాశాలపల్లెతో పాటు మరో మూడు ప్రాంతాలకు వెళ్లే సింధూర కళాశాల ప్రధాన రోడ్డు ఇండేన్ గ్యాస్ గోదాం వరకు పూర్తిగా గుంతలమయంగా ఉండటంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. ఏళ్లుగా రోడ్డు నిర్మించకపోవడంతో రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడి అందులో నీరు నిలిచి ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు, పాదచారులు సైతం ప్రమాదాలకు గురవుతున్నారు. నర్రాశాలపల్లె, జంగాలపల్లె, మల్కాపూర్, రామయ్యపల్లెకు వెళ్లాల్సిన ప్రజలు ఈ రోడ్డు ద్వారా వెళ్లాల్సి ఉండటంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు పక్కన డ్రెయినేజీ సరిగ్గా లేకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చిన నీరు రోడ్డుపై ఉన్న గుంతల్లో చేరి వాటిలో వాహనదారులు పడి ప్రమాదాలకు గురవుతున్నారు. సింధూర కళాశాల రోడ్‌లోని గ్యాస్ గోదాం నుంచి సింధూర కళాశాల వరకు ఉన్న రోడ్డుపై కంకర పోసి తారు వేయడం మరిచి పోవడంతో రెండేళ్లుగా వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. కంకర రాళ్లపై వాహనాలు వెళ్లడంతో పంక్చర్లు అవుతున్నాయన్నారు.

శుభకార్యాలు ఉంటే ట్రాఫిక్ ఇబ్బంది..

సింధూర కళాశాల రోడ్డులో ఫంక్షన్ హాల్స్ ఉండటంతో శుభకార్యాలు జరిగే రోజుల్లో ఈ రోడ్డు పూర్తిగా వాహనాలతో నిండి ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతోంది. రోడ్డుపై ఉన్న గుంతల్లో భారీ వాహనాలు వేగంగా వెళ్లి గుంతల్లో నీరు మనుషలపై పడిన ఘటనలు చాలా వరకు ఉన్నాయి. రామగుండం కార్పొరేషన్ అధికారులు, పాలకులు రోడ్డును వెడల్పు చేయడంతో పాటు ప్రత్యేక నిధులు కేటాయించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


అధ్వానంగా ఉన్న రోడ్డు

రోడ్డుకు మరమ్మతు చేయాలి



రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు పడటంతో ప్రయాణం చేయాలంటే భయమేస్తుంది. ఇక రాత్రి సమయాల్లో రావాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వాహనాలపై నెమ్మదిగా వెళ్లాల్సిందే. కార్పొరేషన్ అధికారులు, పాలకులు ప్రత్యేక నిధులు కేటాయించి రోడ్డు వెడల్పు చేసి మరమ్మలు పనులు చేపట్టాలి. – ఎండీ.రహీం, జిల్లా కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ

సమస్యలు పరిష్కరించాలి



నర్రాశాలపల్లెకు వెళ్లే ప్రధాన రోడ్డు పక్కన డ్రెయినేజీ సరిగ్గా లేకపోవడంతో నీరు చాలా వరకు రోడ్డుపై నిలిచిపోతుంది. ఎవరైనా ఉన్నతాధికారులు పర్యటిస్తే గుంతల రోడ్డుపై స్టోన్ డస్ట్ పోసి మమా.. అనిపిస్తున్నారు. వాహనాల రాకపోకలతో డస్ట్ అంతా పైకి లేచి వాహనదారుల కళ్లలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. – ఈదునూరి రవి, నర్రాశాలపల్లె

క్లుప్తంగా

ఆంగ్ల భాషలో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ముత్తారం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఆంగ్ల ప్రతిభ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొనగా, పోతారం, మోడల్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. స్పెల్లింగ్ టెస్ట్‌లో పోతారం పాఠశాలకు చెందిన వై. రాజ్‌కుమార్ మొదటిస్థానం, మోడల్ పాఠశాలకు చెందిన ఎం. నీహారిక రెండో స్థానం సాధించారు. స్టోరీ టెల్లింగ్ టెస్ట్‌లో మోడల్ పాఠశాల విద్యార్థిని ఎం. నిహారిక మొదటి స్థానంలో నిలవగా, చైతన్య రెండో స్థానంలో నిలిచింది. వీరిని హైస్కూల్ హెచ్‌ఎం హైమావతి, ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ కన్వీనర్ చేగొండ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంద కొమురమ్మకాలనీ వాసులకు న్యాయం చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

గోదావరిఖని: మంద కొమురమ్మ కాలనీ వాసుల న్యాయమైన పోరాటానికి అండగా ఉంటామని తెలంగాణా జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం, అరుణోదయ సాంస్కృతి నాయకురాలు విమలక్క హామీ ఇచ్చారు. ప్రభుత్వాలు అణగారిన వర్గాల అభ్యున్నతికి సహకరించాలన్నారు. ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇప్పించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు రెంటాల రాధ, కోండ్ర అరుణ, సరోజన, అంజలి, అర్చన, నర్సమ్మ, సుగుణ, దేవమ్మ, పద్మ, సుజాత, సారమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రంగంపల్లిలో రంగవల్లుల పోటీ


బహుమతులు అందిస్తున్న చైర్‌పర్సన్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి శివారు రంగంపల్లి (10వ వార్డు)లో ఆదివారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన వారికి మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి బహుమతులను ప్రదానం చేశారు. ఆమె వెంట కౌన్సిలర్ గాదె మాధవి తదితరులున్నారు.

ఐకార్‌లో ఖని విద్యార్థినికి జాతీయ ర్యాంకు


కావేరి

గోదావరిఖనిటౌన్: పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన సలిగంటి కావేరి ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ నిర్వహించిన ప్రవేశ పరీక్షలో జాతీయ ర్యాంకును సాధించారు. శనివారం ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ విడుదల చేసిన ఫలితాల్లో కావేరి 269వ ర్యాంకు సాధించింది. బాల్యం నుండే గురుకులంలో చదువుకున్న విద్యార్థిని ర్యాంకు సాధించడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఓపెన్ స్కూల్ కేంద్రం సందర్శన


అంతర్గాం ఓపెన్‌స్కూల్ కేంద్రం

రామగుండం: అంతర్గాం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో కొనసాగుతున్న తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టీవోఎస్ఎస్) ఆదివారం కరీంనగర్ జిల్లా ఓపెన్ స్కూల్ కో–ఆర్డినేటర్ చల్వాజి నాగేశ్వర్‌రావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓపెన్ స్కూల్ డైరెక్టర్ శ్రీహరి ఆదేశాల మేరకు ఈనెల 9–13వ తేదీ వరకు ఓపెన్‌స్కూల్ అడ్మిషన్ ప్రక్రియను ప్రారంభించనున్నామన్నారు. అనంతరం ఓపెన్‌స్కూల్ నిర్వహణ, పనితీరు, గతంలో ప్రవేశాల సంఖ్య, ఏర్పాట్లు తదితర అంశాలను పరిశీలించారు. ఈ అవకాశాన్ని వయోజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయనతో అంతర్గాం ఓపెన్‌స్కూల్ అక్రిడిటేషన్ ఇన్‌చార్జీ కోఆర్డినేటర్ ఇరుగురాల ఓదెలు ఉన్నారు.

ట్రాన్స్‌కో నిర్లక్ష్యంతో నిలిచిన నిర్మాణం


భవనంపై తొలగించని విద్యుత్ తీగలు

ముత్తారం: దేవుడు వరమిచ్చిన పూజారి కరుణించలేదనే చందంగా ఉంది మండలంలోని ఖమ్మంపల్లి ప్రభుత్వ పాఠశాల పరిస్థితి. అరకొర వసతులతో ఇబ్బందులు పడుతున్న ప్రభుత్వ పాఠశాలకు అదనపు గదులు, మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. తమ పాఠశాలలో గదుల కొరత సమస్య తీరుతుందని ఆశించిన విద్యార్థులకు ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యం శాపమైంది. మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో భవన నిర్మాణపనులు జరుగుతున్నాయి. ఈ పనులు పిల్లర్ల వరకు రావడంతో పైన ఉన్న విద్యుత్ తీగలకు ఫిల్లర్ రాడ్‌లు తగలడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. విద్యుత్ వైర్లు తొలగించాలని ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోవడం లేదని కాంట్రాక్టర్, సర్పంచ్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైర్లు అడ్డుగా ఉండడంతో నెల రోజులుగా పనులు నిలిచిపోయాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వైర్లు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బీఆర్‌ఎస్ హయాంలో అందరికీ ఆరోగ్యం

- ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దాసరి

ఓదెల: బీఆర్‌ఎస్ హయాంలోనే అందరికి ఆరోగ్యం సాధ్యమవుతుందని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొలనూర్‌లో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పక్కాభవనానికి ఆదివారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి మాట్లాడారు. కాల్వశ్రీరాంపూర్, కొలనూర్‌లో 15వ ఆర్థికసంఘం నిధులతో ఆరోగ్యకేంద్రాల పక్కా భవనాలకు నిధులు మంజూరయ్యాయన్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలో 49 పీహెచ్‌సీ సబ్‌సెంటర్లలో ప్రజలకు వైద్య సేవలు అందుతున్నాయన్నారు. గ్రామాలల్లోని సబ్ సెంటర్లలో ఎంబీబీఎస్ డాక్టర్లను నియమించి వైద్య సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడలేని విధంగా ప్రభుత్వ ఆరోగ్యకేంద్రాల్లో సౌకర్యాలను ఏర్పాటు చేసి అన్ని రోగాలకు వైద్యసేవలను అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సామ మణెమ్మ, ఉపసర్పంచ్ పాకాల సంపత్‌రెడ్డి, ఎంపీపీ కునారపు రేణుకదేవి, జెడ్పీటీసీ గంట రాములుయాదవ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఐరెడ్డి వెంకటరెడ్డి, పొత్కపల్లి సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రమోద్‌కుమార్, గోపు నారాయణరెడ్డి, సర్పంచులు ఆళ్ల రాజిరెడ్డి, పల్లె ఓదెలు, కర్క మల్లారెడ్డి, డీల్లి శంకర్, వైద్య సిబ్బంది నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ఎలిగేడు: మండలంలోని ముప్పిరితోట గ్రామానికి చెందిన భూసారపు వెంకటయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని ఆదివారం పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, సర్పంచ్ ఐలయ్య, ఉపసర్పంచ్ చీకటి శైలజ, నాయకులు ఉన్నారు.

అభివృద్ధి పథంలో రామగుండం నియోజకవర్గం

- ఎమ్మెల్యే కోరుకంటి చందర్


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ పథంలో దూసుకెళ్తోందని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. ఆదివారం స్థానిక ప్రధాన చౌరస్తాలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో నూతన క్యాలెండర్ ఆవిష్కరించారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత నీళ్లు, నిధులు, నియామకాలతో ప్రతి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఈ క్రమంలోనే రామగుండం నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. ఈ ప్రాంత ప్రజానీకం సంక్షేమానికి అహర్నిశలు శ్రమిస్తానన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, కార్పొరేటర్లు దాతు శ్రీనివాస్, కుమ్మరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డీటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

రామగుండం: డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) 2023వ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను టీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, డీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి రమేశ్, కిరణ్, షంషోద్దీన్, బయ్యపు సుదర్శన్‌రెడ్డి, ప్రతాప్‌చారి, రమేశ్, రాంచంద్రం, శ్రీనివాస్, వహీద్ ఖాన్, స్వరూప్‌చంద్, తదితరులున్నారు.

మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలి రాజీనామా

గోదావరిఖని: మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కొలిపాక సుజాత తన పదవికి రాజీనామా చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు సునీతారావుకు తన రాజీనామా పత్రాన్ని పంపించినట్లు సుజాత తెలిపారు. జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలుగా వరుసగా కొలిపాక సుజాత రెండోసారి ఇటీవలే ఎన్నికయ్యారు.

బీఆర్‌ఎస్ పార్టీని బలోపేతం చేయాలి

ఓదెల: బీఆర్‌ఎస్ పార్టీని బలోపేతం చేయాలని మండల అధ్యక్షుడు ఐరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ఇందుర్తి, బాయమ్మపల్లె, గుంపుల, గూడెం, జీలకుంట గ్రామాల్లో బీఆర్‌ఎస్ గ్రామశాఖ కమిటీలను నియమించారు. కార్యక్రమంలో ఎంపీపీ కునారపు రేణుకదేవి, సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, రైతుసమన్వయసమితి మండల చైర్మన్ కావటి రాజు, సర్పంచులు, ఎంపీటీసీలు నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై విస్తృత ప్రచారం చేయాలి


శ్రీనివాసరెడ్డిని సత్కరిస్తున్న కేశవరావు

పెద్దపల్లిరూరల్: భారత ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలందరికీ వివరిస్తూ బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని మున్సిపల్ బూత్‌కమిటీల ఇన్‌చార్జీ ఆది కేశవరావు అన్నారు. పట్టణంలోని అమర్‌నగర్ శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణమండపంలో ఆదివారం మొలుగూరి సాగర్ అధ్యక్షతన జరిగిన బూత్ కమిటీ సమావేశానికి కేశవరావు హాజరై మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతాంగ, ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలంతా విసుగుతో ఉన్నారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజల్లో చైతన్యం పెంచుదామని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షుడు కొంతం శ్రీనివాసరెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ పిన్నింటి రాజు, నాయకులు రాజారాంసింగ్, శ్రీనివాసరావు, ఫహీం, రవీందర్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీపాద క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం


పోటీలు ప్రారంభిస్తున్న ట్రస్టు చైర్మన్ శ్రీనుబాబు

మంథని: సంక్రాంతి సందర్భంగా మంథనిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన నియోజక వర్గ స్థాయి శ్రీపాద కప్ క్రికెట్ పోటీలను ట్రస్టు చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు ప్రారంభించారు. ట్రస్టు ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దివంగత మాజీ స్పీకర్ శ్రీపాదరావు ఆశయ సాధనకు ట్రస్టు పనిచేస్తుందన్నారు. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికి పండుగ సెలవుల సందర్భంగా పోటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్రీడా స్ఫూర్తితో ఆడి విజయం సాధించాలన్నారు. కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు సెగ్గెం రాజేశ్, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ శశిభూషణ్ కాచే, మున్సిపల్ కౌన్సిలర్ పెంద్రు రమాదేవి తదితరులు ఉన్నారు.

వాసవీ క్లబ్ ప్రమాణ స్వీకారం


సుల్తానాబాద్ చైర్ పర్సన్ క్లబ్ ప్రతినిధులు

సుల్తానాబాద్: వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఎస్వీఎస్ ఫంక్షన్ హాల్ మంచిర్యాలలోని కొండా చంద్రశేఖర్ జిల్లా గవర్నర్ అధ్యక్షతన నిర్వహించారు. ఆదివారం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రధాన కార్యదర్శి ఇరుకుల్ల రామకృష్ణ హాజరయ్యారు. సుల్తానాబాద్ రీజియన్ చైర్ పర్సన్‌గా ఎల్లంకి రాజన్న, జోన్–1 చైర్ పర్సన్‌గా అల్లంకి లింగమూర్తి ,జోన్–2 చైర్ పర్సన్‌గా బాదం వాణి, జోన్–3 జోన్ చైర్ పర్సన్‌గా కజ్జపుభగవాన్, వాసవీ క్లబ్ సుల్తానాబాద్ అధ్యక్షుడిగా కాసం సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి రామిడిరవీందర్, కోశాధికారిగా అల్లంకి హరీశ్ కుమార్, వనిత క్వీన్స్ క్లబ్ సుల్తానాబాద్ అధ్యక్షురాలిగా యాంసాని రమాదేవి, ప్రధాన కార్యదర్శిగా వసుధ, కోశాధికారిగా జై శెట్టి సుమతో ప్రమాణ స్వీకారం చేయించారు.

నిరుపేదలకు రగ్గులు పంపిణీ


రగ్గులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ

ధర్మారం: మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన నిరుపేదలకు దామోదర్ ఫౌండేషన్ అందించిన 51 రగ్గులను ఆదివారం గ్రామపంచాయతీ ఆవరణలో ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ అందించారు. సర్పంచ్ గందం వరలక్ష్మి కోరిక మేరకు ఫౌండేషన్ అందించిన రూ.30 వేల విలువైన 51 రగ్గులను గ్రామానికి చెందిన నిరుపేద వృద్ధులకు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ వరలక్ష్మి, ట్రస్టు సభ్యులు వేల్పుల నాగరాజు, ఆవుల లత, శ్రీనివాస్, జెల్ల సంపత్, జంగ మహేందర్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

నాడు - నేడు

రామగుండం: పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. ఇది మనబడేనా అనే సందేహం కలుగకమానదు. మనఊరు-మనబడి పథకంలో భాగంగా రూ.9.50 లక్షలతో అదనపు తరగతి గదులు, విద్యుత్ సౌకర్యం, ప్రహరీ, పేయింట్స్‌తో సుందరంగా ముస్తాబు చేస్తుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో రేకుల షెడ్డులో తరగతుల నిర్వహణ, రాళ్లు తేలిన ప్రాంగణం, పిచ్చి మొక్కలు, రంధ్రాలు పడిన పైకప్పుతో అంధవికారం, శిథిలావస్థలో బూత్ బంగ్లాను తలపించేది. మండల పరిధిలోని రామగుండం పీఎస్, విఠల్ నగర్ పీఎస్‌లను త్వరలో అధికారికంగా ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నారు.


గతంలో రేకుల షెడ్డులో పాఠశాల


ప్రస్తుతం ముస్తాబైన నూతన భవనం

ఆరేళ్లుగా అలంకారప్రాయం..!



రామగిరి: సింగరేణి సంస్థ ఆర్జీ–3 పరిధి ఓసీపీ–2లో రూ వందల కోట్ల రుపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన స్ప్రెడర్ ఆరేళ్లుగా అలంకారప్రాయంగా మారింది. ఓసీపీ–2 క్వారీలోని ఓబీ మట్టి, బొగ్గును తరలించేందుకు క్రియాశీలకమైన స్ప్రెడర్ యంత్రం ఏపీఏ ఏరియా పరిధి ఏఎల్పీ గని సమీపంలోని మైదానంలో గత ఆరేళ్లుగా నిలిపి ఉంచారు. దీనికి నిత్యం రక్షణ సిబ్బందిని కాపలాగా ఉంచుతూ కాలయాపన చేస్తున్నారు. సంబంధిత అధికారులు నిర్లక్ష్యం కారణంగా అత్యాధునిక టెక్నాలజీ కలిగిన భారీ యంత్రం ఆరేళ్లుగా నిరుపయోగంగా పడి ఉండడంతో ఇప్పటికే దీనిలోని అతి ముఖ్యమైన మెషినరీ పార్టులు తుప్పుపట్టాయని, వాటి మరమ్మతుల కోసం కోట్లాది రుపాయాలు వెచ్చించాల్సి వస్తుందని కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం స్పందించి స్ప్రెడర్‌లో మరిన్ని పార్టులు చెడిపోకముందే వినియోగంలోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు.

ఇండియన్ కాంగ్రెస్‌లో ఆకట్టుకున్న ప్రాజెక్టు

గోదావరిఖనిటౌన్: గోదావరిఖని జెడ్పీహెచ్‌ఎస్ గరల్స్ స్కూల్‌లో ఐదు రోజులుగా నిర్వహించిన 108వ ఇండియన్ కాంగ్రెస్‌లో గోదావరిఖనికి జెడ్పీహెఎస్ పాఠశాల విద్యార్థిని బి.హరిప్రియ ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుందని జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి తెలిపారు. ఈ నెల 3 నుంచి 7వ తేదీ వరకు జరిగిన కార్యక్రమంలో హరిప్రియ ఎన్‌సీఎస్‌సీ లో భాగంగా 'ఓవర్ కమింగ్ ఆఫ్ పికా డిజార్డర్ ఈటింగ్ స్లేట్ పెన్సిల్' ప్రాజెక్టుకు ప్రశంసా పత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని అభినందించారు. చిన్న తనంలో కొందరు పిల్లలు కాల్షియం లోపంతో బలపాలు తినే అలవాటును ఈ ప్రాజెక్టు ద్వారా ఏలాంటి దుష్ప్రభావాలు లేకుండా రూపుమాపవచ్చని తెలిపారు. ఇంట్లో పోషక విలువలతో తయారు చేసిన స్లేట్ పెన్సిల్స్‌ను తింటే ఎలాంటి అనారోగ్యం కలుగకదని, పోషకాలు కూడా పుష్కలంగా లభిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమానికి కృషి చేసిన గైడ్ టీచర్ పి.సునీతను అభినందించారు.

టీఎన్‌జీవో కాళేశ్వర్ జోన్ సభ్యురాలిగా సాగరకళ్యాణి

పెద్దపల్లిరూరల్: జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రొడ్డ సాగరకళ్యాణి కాళేశ్వరం జోన్ కార్యవర్గ సభ్యురాలిగా నియమితులైనట్లు మంచిర్యాల జిల్లా టీఎన్‌జీవోల సంఘ అధ్యక్షుడు శ్రీహరి ప్రకటించారు.

డ్రెయినేజీ నిర్మాణ పనులు ప్రారంభం

పాలకుర్తి: మండలంలోని జీడీనగర్ ఎస్సీ కాలనీలో రూ.8 లక్షల నిధులతో నూతనంగా నిర్మించనున్న సీసీరోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులను ఆదివారం సర్పంచ్ సూర సమ్మయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రెడపాక వసంత, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇసుక లారీ ఢీకొని ఒకరికి గాయాలు

ముత్తారం: మండలంలోని ఖమ్మంపల్లిలో ఇసుక లారీ ఢీకొని ఒకరికి గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన మంథని రాయమల్లు పొలం పనికి వెళ్లి బైక్‌పై తిరిగి ఇంటికి వస్తుండగా ఇసుక లోడ్‌తో వస్తున్న లారీ ఢీకొట్టడంతో కింద పడిపోయాడు. కాళ్లకు తలకు గాయాలు కావడంతో మంథని ఆస్పత్రికి తరలించారు.

కులంపేరుతో దూషించిన వ్యక్తిపై కేసు

ఓదెల: కొలనూర్ ఎంపీటీసీ కారెంగల శ్రీనివాస్‌ను కులంపేరుతో దూషించిన పూసల రవిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల పరిధి కొమాళ్లపల్లికి చెందిన పూసల రవి కొలనూర్ ఎంపీటీసీని కులంపేరుతో దూషించడంతోపాటు చంపుతానని బెదిరించాడని బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

శబరిమలకి తరలిన అయ్యప్ప దీక్షాపరులు

పెద్దపల్లిరూరల్: స్వామియే శరణం అయ్యప్పా.. అనే నామస్మరణలతో భక్తులు ఆదివారం స్థానిక అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ కన్వీనర్ కావేటి రాజ్‌గోపాల్ సారథ్యంలో శబరిమలైకి బస్సులో బయల్దేరారు. వారిని కుటుంబీకులు, బంధుమిత్రులు స్వాములను సాగనంపారు.